క్లుప్తంగా

ఇక ఐరిష్‌తో రేషన్



ఐరిష్ పరికరాలను అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎండీయూలు

మద్దిపాడు: వేలి ముద్రలు పడక రేషన్ తీసుకోలేక పోతున్న ప్రజలకు ఇకపై ఐరిష్ మెషీన్ ద్వారా రేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. దీంతో ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లకు ఐరిష్ మిషన్లు పంపిణీ చేయడంతో గురువారం మండలంలోని ఎండీయూలకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల ఆ పరికరాలను అందించారు. వేలి ముద్రలు పడని వారికి ఐరిష్ ఆధారంగా రేషన్ ఇవ్వడానికి వీలు కలుగుతుందని ఆయన అన్నారు. యూనిట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం



ఈదురు గాలులకు చదలవాడ గ్రామ పంచాయతీలో లేచిపోయిన రేకులు

నాగులుప్పలపాడు: ఈదురు గాలులుకు రేకులు లేచిపోయిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సాయంత్రం మండలంలోని చదలవాడ, మద్దిరాలపాడు, నాగులుప్పలపాడులో బలమైన గాలులు వీచాయి. దీనితో పాటు ఓ మోస్తరులో వర్షం కూడా కురిసింది. గాలుల ధాటికి చదలవాడ గ్రామ పంచాయతీ కార్యాలయం రేకులు లేచిపోయాయి.

కొత్తపట్నం: గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలో 15 గ్రామ పంచాయతీలకు విద్యుత్ అంతరాయం కలిగింది. 6 సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కరెంటు తీగులు తెగిపోవటంతో పాటు, కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి. కొన్ని చోట్ల చెట్లు కూడా నేలకొరిగాయి. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు.

15 కరెంటు స్తంభాలు ధ్వంసం

చీమకుర్తి: గాలి వాన బీభత్సానికి 15 కరెంటు స్తంభాలు విరిగి పడిపోయాయి. గురువారం సాయంత్రం చీమకుర్తి మండలంలోని జీఎల్.పురం, రామచంద్రాపురం పరిసరాలలో వీచిన పెనుగాలుల ధాటికి కరెంటు స్తంభాలు నేలకొరిగినట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా మండలంలోని ఇతర గ్రామాల నుంచి సమాచారం రావాల్సి ఉందని, నష్టం అంచనా వేస్తున్నట్లు తెలిపారు.



రామచంద్రాపురంలో విరిగిన కరెంటు స్తంభాలు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

కొనకనమిట్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సూపర్‌వైజర్లు, అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులకు వివరించాలని కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, బాలికలు చదువుకునేలా వారికి అవగాహన కలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢ నమ్మకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రధానపాత్ర పోషించాలన్నారు. బాలబాలికల హక్కులు, లింగ వివక్షపై వ్యతిరేక పోరాటం, లింగ నిర్ధారణ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సావిత్రి, ప్రసన్న, ఝూన్సీ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కర్లింగ్ పోటీల్లో పీవీఆర్ బాలికల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థినులు

ఒంగోలు: అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి కర్లింగ్ పోటీల్లో ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. సబ్ జూనియర్స్ విభాగంలో వర్షిత, జ్యోషిత(బంగారు పతకాలు), జూనియర్స్ విభాగంలో మమత, ధాత్రి, వర్షిత(కాంస్య పతకాలు) సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్‌ఎం బంకా లక్ష్మీ ప్రసన్న, వ్యాయాయ ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అభినందించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం



అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును సత్కరిస్తున్న గురవారెడ్డిపాలెం గ్రామస్తులు

- టీడీపీ నాయకులకు ఓపెన్ చాలెంజ్ విసిరిన ఎమ్మెల్యే టీజేఆర్
- ఉపాధి పనులను సర్పంచ్‌లకు చెప్పి చేయండి
- మండల పరిషత్ సర్వసభ్యసమావేశంలో టీజేఆర్

చీమకుర్తి: గ్రామాల్లో ఎవరెవరు ఎంత అభివృద్ధి చేశారో చర్చిద్దాం రండి అంటూ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు టీడీపీ నాయకులు, ఆ పార్టీ శ్రేణులకు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. గురువారం సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో పాటు ఆపార్టీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్న 2014–19లో ఎంత అభివృద్ధి చేశారో, 2019–23 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంత అభివృద్ధిచేసిందో ఉదాహరణలతో వివరించారు. గురవారెడ్డిపాలెం పంచాయతీలో టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో కేవలం రూ.3.28 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు చేస్తే, వైఎస్సార్ సీపీ కేవలం నాలుగేళ్లలోనే రూ.11.91 కోట్ల మేర కేటాయించిందన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్యభవనాలు, సైడు కాలువలు, రోడ్లు, మంచినీటి సాకర్యాలు ఇవి అభివృద్ధి పనులు కాదా...? అని ప్రశ్నించారు.

ఉపాధి పనులను సర్పంచ్‌లకు చెప్పి చేయండి

గ్రామాల్లో పేదలకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను స్థానిక గ్రామ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు చెప్పి చేయాలని ఉపాధి హామీ ఏపీఓని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సూచించారు. గ్రామాల్లో ఏఏ పనులను చేస్తున్నారో, ఎంతెంత కూలీ పడుతుందో వివరించాలని తెలిపారు. పనికి రాని కూలీలకు దొంగ మస్టర్‌లను వేయొద్దని ఏపీఓకు సూచనలు చేశారు. తదుపరి అంగన్‌వాడీ శాఖపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇటీవల నియమించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నియామక పత్రాలను ఈ సందర్భంగా అందించారు.

గురువారెడ్డిపాలెంలో మన ఊరు–మన ఎమ్మెల్యే

అనంతరం గురవారెడ్డిపాలెంలో స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జగనన్న కుటుంబ సమావేశాలకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరయ్యారు. స్థానిక గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గణాంకాలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం

ఒంగోలు టౌన్: వాతావరణంలో సంభవిస్తున్న ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి ప్రజలంతా బాధ్యతగా తమ వంతు పాత్ర పోషించాలని నగర కమిషనర్ యం.వెంకటేశ్వరరావు కోరారు. గురువారం కొత్త కూరగాయల మార్కెట్‌లో సింగిల్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోడించడం వలన వాతావరణం వేడెక్కడమే కాకుండా ప్రాణాంతక క్యాన్సర్ ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. రానున్న ప్రమాదాన్ని నివారించడంలో భాగంగా ప్రభుత్వం 120 మైక్రాన్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేధించిందని తెలిపారు. ప్రజలు తమ జీవన శైలిని మార్చుకొని ప్లాస్టిక్‌ను దూరంగా పెట్టాలన్నారు. భూమికి హాని కలిగించడమంటే తమకు తాము నష్టం కలిగించుకోవడమే కాకుండా భవిష్యత్ తరాలకు తీరని ప్రమాదాన్ని మిగల్చడమే అన్నారు. ఇందుకోసమే ఐక్యరాజ్య సమితి లైఫ్ స్టైల్ ఎన్విరాన్‌మెంట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు తమ సొంత కార్యక్రమంగా భావించి లైఫ్ ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నీటిని వృథా చేయరాదని, ఇంధన వినియోగాన్ని తగ్గించే ఇ- మోటారు వావహనాలను వాడాలని, రసాయనిక ఎరువులను వాడరాదని వివరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులకు 2 వేల రుపాయల జరిమానా విధించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ సిబ్బంది, వ్యాపార సంస్థల యజమానులు పలువురు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ వెంకటేశ్వరరావు

బీసీ హాస్టల్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ హాస్టల్ జిల్లా విద్యార్థులు

ఒంగోలు: బీసీ హాస్టల్‌లో వసతి పొంది పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ , బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనంతరాము, డైరెక్టర్ పి.అర్జునరావు, అదనపు డైరెకటర్ బి.చంద్రశేఖర్‌రాజు, సహాయ సంక్షేమశాఖ అధికారి జబ్బార్ తదితరులు అభినందించినట్లు గురువారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కనిగిరికి చెందిన కె.ప్రియదర్శిని 587 మార్కులు, పామూరు–2 వసతిగృహం విద్యార్థి జి.జయసింహారెడ్డి 582, కనిగిరి వన్ విద్యార్థిని ఏవీ మణికంఠ–582 మార్కులు, ప్రభుత్వ బాలుర వసతిగృహం పామూరు 2 నుంచి పి.ప్రేమ్‌కుమార్ 577, పీవీ సాయితేజ 576 మార్కులు, కనిగిరి వన్ వసతి గృహం నుంచి బి.మనోహర్ 576 మార్కులు సాధించారు. ఈమేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి యం.అంజల పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్ రెండు, నాలుగు ర్యాంకులు మావే!



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ఎ.వి.రమణారెడ్డి, డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి,ఎ.గంగాశంకరరెడ్డి



విద్యార్థులతో శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

- శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎ.రమణారెడ్డి

ఒంగోలు: జేఈఈ మెయిన్స్ రెండో పేపర్ (బీఆర్క్, బీప్లానర్)కు ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయి రెండు, నాలుగు ర్యాంకులు సాధించారని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎ.రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్.శ్రీచరణ్‌కుమార్ రెడ్డి 2వ ర్యాంకును, వై.కార్తికేయ 4వ ర్యాంకును, తుమ్మా నితిన్ రెడ్డి 45, నుసుం జయప్రకాష్ రెడ్డి 75వ ర్యాంకును కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో 100లోపు నాలుగు, 200 లోపు 8 మంది, 500 లోపు 12 మంది, వెయ్యిలోపు 23 మంది, 5 వేలలోపు 49 మంది జాతీయ ర్యాంకులు సాధించారన్నారు. అదే విధంగా తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో కె.విష్ణుమాదవ్ రాష్ట్ర స్థాయి 887వ ర్యాంకును కైవసం చేసుకున్నాడని తెలిపారు. జాతీయ స్థాయి రెండో ర్యాంకు గ్రహీత శ్రీచరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. నాలుగో ర్యాంకు గ్రహీత, మర్రిపూడి మండలం రామాయపాలేనికి చెందిన వై.కార్తికేయ మాట్లాడుతూ అధ్యాపకుల అత్యుత్తమ బోధన ద్వారానే జరిగిందని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్లు ఎ.గణేష్ రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎస్‌వి సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రతిభ విద్యార్థుల సంచలనం

ఒంగోలు: జేఈఈ మెయిన్స్ రెండో పేపర్, తెలంగాణ ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారని శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన నల్లూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దొరసాల విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయి మెడికల్ విభాగంలో 3833వ ర్యాంకు, వెన్నా జ్యోతి రాష్ట్రస్థాయి ఇంజనీరింగ్ విభాగంలో 3954 ర్యాంకు, పిచ్చపాటి జ్యోతి 4640, గుజ్జుల అంకిరెడ్డి 5063, నూర్‌భాషా షేక్ అబ్దుల్ 5138, వడ్లమూడి గౌతమి 7107, దూదేకుల విష్ణుతేజ 7315, బోగాడి శ్యామ్‌ప్రసాద్ 7675, ముప్పరాజు నిశ్చల్ 8598, కిలారి సుస్మిత చౌదరి 9065, పొట్లా రవళి 9494, గంగిరెడ్డి నరేంద్రరెడ్డి 9935 ర్యాంకులు పొందారన్నారు. జేఈఈ మెయిన్స్ రెండో పేపర్ (బీఆర్క్, బీప్లాన్)లో జాతీయ స్థాయిలో పలు ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

కంభం: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని స్థానిక ఎస్ఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో మేరీ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటాలన్నారు.

సమిత్వ సర్వే పరిశీలన



సమిత్వ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

కొత్తపట్నం: మండలంలోని రంగాయపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న సమిత్వ సర్వేను డీఎల్‌పీఓ పద్మ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సమిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యదర్శులు ఉస్నారా బేగం, మోటుమాల పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌ను అభివృద్ధి చేయాలి

- రాష్ట్ర మహిళా మార్ట్ అడిషనల్ డైరెక్టర్ మహిత
- వీవోఏల శిక్షణ కార్యక్రమం సందర్శన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, రాష్ట్ర మహిళా మార్ట్ అడిషనల్ డైరెక్టర్ మహిత

మద్దిపాడు: మహిళా మార్ట్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా మార్ట్ అడిషనల్ డైరెక్టర్ మహిత పిలుపునిచ్చారు. త్వరలో మద్దిపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న చేయూత మహిళా మార్ట్ నడపడానికి వీవోఏలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ బాబూరావుతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో చేయూత మహిళా మార్ట్ స్వయం సహాయక సంఘాలకు ఆదాయ వనరుగా రూపొందుతుందన్నారు. మండలంలోని ప్రజలకు మార్ట్ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు లభిస్తాయని తెలిపారు. కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మహిళా మార్ట్ గురించి స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో మొదటిగా టంగుటూరులో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశామని, మద్దిపాడులో రెండో మార్ట్ ఏర్పాటు చేస్తున్నామని మహిత తెలిపారు. మండలంలో మార్ట్ ఏర్పాటు తర్వాత పర్యవేక్షణ కమిటీ, కొనుగోలు కమిటీ, తనిఖీ కమిటీ, ఆర్థిక కమిటీలను ఏర్పాటు చేసి మార్ట్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. కార్యక్రమంలో చేయూత ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ విజయమ్మ, జిల్లా డీపీఎం సునీత, ఏపీఎం నరేంద్రకుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ దివ్యవాణి, కోమలి నాగేంద్రం, మార్ట్ కమిటీ సభ్యులు, సీసీలు వీవోఏలు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు అర్బన్: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాల్లో 2023–24 సంవత్సరానికి వసతి కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు సంతపేటలోని వసతి గృహంలో 100 సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 3వ తరగతి నుంచి పీజీ వరకు, వృత్తి విద్యా కోర్సులు చదివే వారికి సైతం వసతితో పాటు నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శారీరక దివ్యాంగులు, పాక్షిక అంధత్వం, బధిరత్వం కలిగిన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవచ్చన్నారు. వసతి గృహానికి దగ్గరలోని పాఠశాల, విద్యా సంస్థల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ప్రతి విద్యార్థికి ఉచిత భోజన వసతి, సౌకర్యాలతో పాటు నోట్‌బుక్స్, కాస్మోటిక్ చార్జీలు కూడా ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 08592–281310, 90002 80068 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

కొత్తపట్నం: విద్యుత్ వినియోగంలో వృథా చేయకుండా పొదుపు చేయాలని డీఎల్‌పీఓ పద్మ అన్నారు. మండలంలో మోటుమాల పంచాయతీ పరిధిలో గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా జరుగుతున్న పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్ అవసరమైనంత వరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలని తెలియజేశారు. విద్యుత్ ఆదా చేసుకోవటం వలన మన బిల్లు కూడా తక్కువ రావడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా అవుతుందన్నారు. అనంతరం ఒక గృహంలోకి వెళ్లి స్విచ్‌లను ఏవిధంగా వినియోగించాలి, హీటర్‌ను గృహాలకు సంబంధించిన ప్రతి ఎలక్ట్రికల్ సామాను గురించి విద్యుత్ ఆదాపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాల్‌మెంట్ మిషన్‌లో భాగంగా 7 కేటగిరీల్లో 70 జీవనశైలికి సంబంధించిన అంశాలపై వివరించారు. వాతావరణ మార్పుల్లో ప్రతికూల ప్రభావాలను తగ్గించటం, ప్రతి వ్యక్తి జీవనశైలీలో మార్పులు రావాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టారన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ఎంపీడీవో పి.సుజాత, మెడికల్ ఆఫీసర్ డా.వైష్ణవి, డా.హేమంత్ కుమార్, సర్పంచ్ కోడూరు గోపి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరెడ్డి, రజియా సుల్తాన్ బేగం, సచివాలయ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కేవీఆర్ స్టార్ లైట్ నీట్ అకాడమీ సత్తా



761వ ర్యాంకు కైవసం చేసుకున్న విద్యార్థినిని అభినందిస్తున్న కేవీర్

ఒంగోలు: స్థానిక కేవీఆర్ స్టార్‌లైట్ నీట్ అకాడమీ విద్యార్థులు తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో సత్తాచాటారు. పీవీ లలిత రాష్ట్రస్థాయిలో 761వ ర్యాంకును, వి.బాబు శ్రీమాన్ 824వ ర్యాంకు, పి.భవ్య 1847, లిఖిత 3881, హర్షవర్ధన్‌సాయి 5356వ ర్యాంకు, టి.దుర్గావినూత్న 6015వ ర్యాంకులు కైవసం చేసుకున్నారని కేవీఆర్ మీడియాకు తెలిపారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. నీట్‌లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు కూడా జీరో నుంచి సులభమైన టిప్స్‌తో అర్థమయ్యే రీతిలో మెరుగైన విద్యార్థిగా తీర్చిదిద్దడం తమ అకాడమీ ప్రత్యేకతన్నారు. కష్టతరమైన ఫిజిక్స్‌ను సులభమైన రీతిలో బోధిస్తూ విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా రాణించేలా ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థులకు కూడా శిక్షణ ఇస్తున్నట్లు కేవీఆర్ తెలిపారు. నలుగురు విద్యార్థులకు ఒక హాస్టల్ గది, ఆ గదిలోకే భోజనాలు అందించడంతోపాటు యాజమాన్య కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

దేవునిపై నమ్మకం ఉంచండి



వాక్య సందేశాన్ని అందిస్తున్న విజయకుమార్



పాల్గొన్న భక్తులు

ఒంగోలు రూరల్: దేవుని కార్యాలు చూడాలంటే దేవునిపై నమ్మకం కలిగి ఉండాలని రెవరెండ్ విజయకుమార్ అన్నారు. కరవది బేతేల్ ప్రార్థనా మందిరంలో సువార్త సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నమ్ముట వలన విశ్వాసం కలుగుతుందని అట్టి విశ్వాసం దైవమార్గంలో పూర్ణ మనస్సుతో ఉంటేనే లభిస్తుందన్నారు. నిర్వాహకులు బేతేల్ మినిస్ట్రీస్ కుమారి బేబిస్టార్, స్థానిక పాస్టర్ సి.హెచ్.విక్టర్‌పాల్, సంఘ పెద్దలు బేతేల్ యూత్ వారు పాల్గొన్నారు.